సాక్షి
వికారాబాద్
గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



విచారణ.. మమ!

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో▸



మాకేదీ.. 'ఇందిరమ్మ'?

ఇందిరమ్మా.. మా ఊరికి ఇల్లేదమ్మా.. అంటూ వాల్యానాయక్‌తండా గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

విద్యార్థులు, యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ వసంత్ జాదవ్ సూచించారు. 8లో▸

న్యూస్‌రీల్

విశ్వకర్మల అభ్యున్నతికి కృషి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: విశ్వకర్మల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఖాంజాపూర్ గుట్ట వద్ద విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుట్ట ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. సీసీ రోడ్లు, విద్యుత్ సదుపాయం, వంటగదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు.

నేటి నుంచి విధుల్లోకి జీపీఓలు



కౌన్సెలింగ్‌కు హాజరైన జీపీఓలు

అనంతగిరి: భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. క్లస్టర్ల వారీగా గ్రామ పరిపాలన అధికారుల(జీపీఓలు) కేటాయింపు ప్రక్రియను బుధవారం పారదర్శకంగా నిర్వహించనట్లు తెలిపారు. భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం జీపీఓలను నియమించిందన్నారు. 139 మందికి బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. గురువారం నుంచి విధుల్లో చేరాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్‌ఓ మంగీలాల్, ఏఓ ఫర్హీన్ కాతున్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత కార్యక్రమాలను విజయవంతం చేద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

తాండూరు టౌన్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ యాదగిరి తెలిపారు. మున్సిపల్ సిబ్బందితో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి 20వ తేదీ వరకు పరిశుభ్రత కార్యక్రమాలు, 23, 24వ తేదీల్లో విద్యాలయాల వద్ద శుభ్రత, 25న చెరువుల వద్ద, 26న ప్రభుత్వ కార్యాలయాల వద్ద, 27న ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద, 29, 30న పార్కుల్లో శుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు నీరజా బాల్‌రెడ్డి, ప్రభాకర్ గౌడ్, సోమశేఖర్, విజయాదేవి, రవి, మేనేజర్ నరేందర్ రెడ్డి, ఏఈ ఖాజా హుస్సేన్, ఉద్యోగులు ఉదయ్, వెంకటయ్య ఉమేష్, ప్రవీణ్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐను కలిసిన కాంగ్రెస్ యూత్ నాయకులు



ఎస్‌ఐతో యూత్ కాంగ్రెస్ నాయకులు

యాలాల: ఇటీవల యాలాల ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన విఠల్‌రెడ్డిని బుధవారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. యూత్ విభాగం మండల అధ్యక్షుడు వీరేశం ఎస్‌ఐను సన్మానించారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు యూత్ కాంగ్రెస్ తరఫున అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖాసీం, కిషన్, కేఎస్ఎస్, ప్రశాంత్ కుమార్, రమేష్, నగేష్, మహిపాల్, పాల శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జోనల్ స్థాయి పోటీలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు జోనల్ స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు జోనల్ కార్యదర్శి అజీజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల్ మండలాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాలకు సంబంధించి క్రీడాకారుల ఎంపిక ఉంటుందని తెలిపారు.

మన చరిత్ర ఘనం

మహనీయుల త్యాగ ఫలితమే తెలంగాణ స్వాతంత్ర్యం

- నిజాం రాచరిక వ్యవస్థకు చరమగీతం పాడిన రోజు
- సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు
- రైతు సంక్షేమానికి పెద్ద పీట
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- ఘనంగా ప్రజాపాలన కార్యక్రమం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్: ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగానే రాచరిక వ్యవస్థకు చరమగీతం పడిందని.. ఆ రోజును స్మరించుకోవడం ఎంతో అవసరమని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ కలెక్టరేట్‌లో తెలంగాణ విలీన దినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అందరికీ 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే.. తెలంగాణ మాత్రం 1948 సెప్టెంబర్ 17న స్వేచ్ఛా వాయువులు పీల్చుకుందన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అరాచకాలతో మన ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఎందరో మహనీయులు అసువులు బాశారని అన్నారు. ఇక్కడి ప్రజల స్వాతంత్ర్య ఆకాంక్షను గుర్తించి నాటి ప్రధాని నెహ్రూ, హోంశాఖ మంత్రి సర్దార్ పటేల్ చొరవతో హైదరాబాద్ సంస్థానాన్ని భారత దేశంలో విలీనం చేశారని గుర్తు చేశారు. ఈ రోజును మనం ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకొంటున్నామని పేర్కొన్నారు.

హామీలనీ అమలు చేస్తున్నాం

సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుందని తెలిపారు. అభయ హస్తంలో భాగంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పథకాలు అందని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతు భరోసా పథకం కింద ప్రతి ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. ఇలా రైతు సంక్షేమ కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఆరు గ్యారంటీలను నెరవేర్చే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ, గృహ జ్యోతి, మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, సబ్సిడీ గ్యాస్ వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. రుణమాఫీ పథకం కింద 1,00,358 మంది రైతుల రూ.849.30 కోట్ల పంట రుణాలను మాఫీ చేసిందన్నారు. జిల్లాకు 13,640 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా.. 11 వేల పైచిలుకు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు కూడా ఇచ్చినట్లు గుర్తు చేశారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వటంతో పాటు పేదలందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న స్పీకర్, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ తదితరులు

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షల వరకు పెంచి పేదలకు ఆరోగ్య భరోసా కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద 924 పాఠశాలల్లో రూ. 17.55 కోట్లు ఖర్చు చేసి మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. రైతుల నుంచి ధాన్యం సేకరించడంతోపాటు క్వింటాలు సన్న రకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. వెనుకబడిన కొడంగల్ అభివృద్ధికి కడా ఏర్పాటు చేసి అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్‌చౌదరి, డీఆర్వో మంగీలాల్, ఆర్డీఓ వాసుచంద్ర, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ట్రిపుల్ ఆర్ భూ బాధితులు

మా భూములను కాపాడండి

- కేటీఆర్‌ను కోరిన ట్రిపుల్ ఆర్ భూ బాధితులు
- ఆందోళన వద్దు.. పార్టీ అండగా ఉంటుందని హామీ

అనంతగిరి/మోమిన్‌పేట: ట్రిపుల్ ఆర్ భూ బాధితులకు బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భరోసా ఇచ్చారు. పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ ఆందోళన చెందరాని హామీ ఇచ్చారు. మండలంలోని టేకులపల్లి, దేవరంపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు బుధవారం నగరంలోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చడం ద్వారా తమ భూములు పోతున్నాయని, ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దల ఆస్తులను కాపాడేందుకు పేద రైతుల పొట్ట కొడుతోందని ఆరోపించారు. రైతులకు సమాచారం ఇవ్వకుండా సర్వే చేయడం ఏమిటని ప్రశ్నించారు. అభివృద్ధికి పేదల భూములే కావాలా అని నిలదీశారు. రైతులు మెచ్చేలా పరిహారం చెల్లించిన తర్వాతే భూములు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. బలవంతపు భూసేకరణ మంచిది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. గతంలో ఓఆర్ఆర్ విషయంలో కూడా ఇదే విధంగా సొంత ఎజెండాతో పేద రైతులను ముంచిందన్నారు. ఇప్పుడు అలైన్‌మెంట్ మార్చడం వెనుక పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మర్పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్, భూములు కోల్పోతున్న రైతులు ఉన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

అనంతగిరి: మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ మెగా హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 56 రకాల పరీక్షలు, 17 మంది స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వికారాబాద్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా ఆధునీకరణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, డీఎంహెచ్ఓ లలితాదేవి తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరానికి హాజరైన నాయకులు, ప్రజలు

ఫేక్ ఓటర్ల ఫిర్యాదుపై విచారణ

ధారూరు: మండలంలోని ఎబ్బనూర్ గ్రామంలో 52 మంది ఫేక్ ఓటర్లు ఉన్నారని వచ్చిన ఫిర్యాదుపై బుధవారం డీఆర్ఓ మంగీలాల్ విచారణ చేపట్టారు. గ్రామ ఓటరు జాబితాలో 52 మంది పేర్లు ఉన్నా వారు స్థానికంగా లేనివారని కొంతమంది కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డీఆర్ఓ ధారురు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. విచారణకు హాజరుకావాలని ఆ 52 మందికి సమాచారం ఇచ్చారు. మొదటి రోజు 26 మంది రావాల్సి ఉండగా 12 మాత్రమే వచ్చారు. గురువారం కూడా విచారణ చేపట్టనున్నట్లు తహసీల్దార్ సాజిదాబేగం తెలిపారు.



ఓటరు జాబితాపై విచారణ జరుపుతున్న డీఆర్ఓ మంగీలాల్

తాండూరు డీఎల్‌పీఓగా ప్రవీణ్‌కుమార్



తాండూరు రూరల్: తాండూరు డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీఓ)గా కే ప్రవీణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన శంకర్‌నాయక్ నల్లగొండ జిల్లాకు బదిలీపై వెళ్లారు. దీంతో పెద్దేముల్ ఎంపీఓ రతన్ సింగ్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సంగారెడ్డి జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌కు ప్రభుత్వం డీఎల్‌పీఓగా పదోన్నతి కల్పించి తాండూరుకు బదిలీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరు డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో పారిశుద్ధ్య మెరుగునకు కృషి చేస్తానని తెలిపారు. సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగనున్నట్లు తెలిపారు. అనంతరం డీఎల్‌పీఓను కార్యాలయ సిబ్బంది వెంకటయ్య, నర్సింలు ఘనంగా సన్మానించారు.

ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేయాలి



అనంతసాగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

- డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని అనంతసాగర్ గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన పేదలను గుర్తించి వారికి నీడ కల్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. లబ్ధిదారులు ఇంటి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రాంచంద్రయ్య, భరత్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు మహేష్, పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నాయకులు కుర్మయ్య, రఘు, కేశవులు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అత్త.. రోడ్డు ప్రమాదంలో అల్లుడు

- ఒకే ఇంట్లో ఇద్దరి మృత్యువాత
- పులుమద్దిలో విషాదం



జోగు లక్ష్మి (ఫైల్)



శ్రీనివాస్ (ఫైల్)

అనంతగిరి: అనారోగ్యంతో మృతిచెందిన అత్త ఫొటోలతో వేసిన శ్రద్ధాంజలి బ్యానర్లను తీసుకెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై అల్లుడు చనిపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ మండలం పులుమద్దికి చెందిన నల్ల శ్రీనివాస్(36) హైదరాబాద్‌లో రైల్వే హోంగార్డుగా పనిచేస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన మహిళతో ఇతనికి వివాహం జరగగా ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇదిలా ఉండగా శ్రీనివాస్ అత్త జోగు లక్ష్మి(భార్య తల్లి) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం నగరంలోని ఓ ఆస్పత్రిలో మృతి చెందింది. ఆమె అంత్యక్రియల నేపథ్యంలో గ్రామంలో ఏర్పాటు చేసేందుకు ప్రింట్ చేయించిన శ్రద్ధాంజలి ఫ్లెక్సీల కోసం శ్రీనివాస్ పులుమద్ది నుంచి వికారాబాద్‌కు వచ్చాడు. బ్యానర్లు తీసుకుని తిరిగి వెళ్తున్న క్రమంలో కొత్తగడి దాబా వద్ద రోడ్డుపై ఉన్న గుంతను తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఇదే సమయంలో వచ్చిన డీసీఎం వ్యాన్ శ్రీనివాస్ పైనుంచి వెళ్లడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వికారాబాద్ పోలీసులు తెలిపారు.

వరండా చదువులు ఇంకెన్నాళ్లు!

- శిథిలావస్థలో జీవన్గీ జెడ్పీ ఉన్నత పాఠశాల భవనం
- నాలుగు గదులకు తాళం
- ఉన్న మూడింటిలోనే 5 తరగతులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు



దెబ్బతిన్న వంటగది



వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు

బషీరాబాద్: మండలంలోని జీవన్గీ జెడ్పీ ఉన్నత పాఠశాల సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. కనీస సదుపాయాలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 102 మంది విద్యార్థులు ఉన్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో నాలుగు గదులకు తాళం వేశారు. ఉన్న మూడు గదుల్లో 8 నుంచి 10 తరగతి వరకు.. మిగిలిన 6, 7 తరగతులను వరండాలో నిర్వహిస్తున్నారు. చిన్నపాటి వర్షం పడిన బోధనకు అంతరాయం కలుగుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తలుపులు, కిటికీలు, గోడలు దెబ్బతిన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటున్నారు. వంటగది పరిస్థితి కూడా దారుణంగా ఉంది. మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు నిర్వాహకులు జంకుతున్నారు.

రూ.30 లక్షలు వెనక్కు

మన ఊరు.. మనబడి పథకం కింద గత ప్రభుత్వం రూ.30లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో కొత్త తరగతి గదులు నిర్మించాల్సి ఉంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం కారణంగా పనులు ప్రారంభం కాకుండానే నిధులు వెనక్కు వెళ్లాయి. చిన్నపాటి మరమ్మతులతో సరిపెట్టి విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

నిరుపయోగంగా బల్లలు

పాఠశాలల ప్రారంభ సమయంలో విద్యార్థులు కూర్చునేందుకు ప్రభుత్వం 60 డ్యూయల్ బల్లలు పంపిణీ చేసింది. ఇప్పటి వరకు వాటిని వినియోగించలేదు. దీంతో నిరుపయోగంగా మారాయి.

నిధులు మంజూరు చేయాలి

పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలి. ప్రస్తుతం మూడు గదులు మాత్రమే అందుబాటులో ఉండటంతో 8 నుంచి 10వ తరగతి వరకు నిర్వహిస్తున్నారు. 6, 7వ తరగతి విద్యార్థులకు వరండాలో బోధన చేస్తున్నారు. వర్షం పడ్డా, ఎండ ఎక్కువగా ఉన్నా ఇబ్బంది పడుతున్నాం.

– 6వ తరగతి విద్యార్థులు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

పాఠశాలలో గదులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. గతంలో మన ఊరు.. మనబడి పథకం కింద నిధులు మంజూరైన పనులు జరగలేదు. ప్రస్తుతం మూడు తరగతులను వరండాలో నిర్వహిస్తున్నాం. పాఠశాలకు మంజూరైన బల్లలను వినియోగిస్తాం.

– దూస రాములు, ఎంఈఓ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బొంరాస్‌పేట: హైదరాబాద్‌లో ఉంటూ మేస్త్రీ పనిచేస్తున్న దౌల్తాబాద్ మండలం అల్లాపూర్‌కు చెందిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్‌ఐ బాల వెంకటరమణ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉట్కూరు శకనప్ప(40) ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా మంగళవారం రాత్రి చౌదర్‌పల్లి గేటు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మరణించాడు. మృతుడి సోదరుడు ఆశప్ప ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



రాములును సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు తదితరులు

దోమ: సామాన్య శాస్త్రం బోధిస్తున్న రాములు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికవ్వడం హర్షణీయమని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో తోటి ఉపాధ్యాయులతో కలిసి ఆయన శాలువాకప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ..ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేస్తున్నారన్నారు. జిల్లా స్థాయిలో తమ పాఠశాల ఉపాధ్యాయుడికి అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

బషీరాబాద్: రోడ్డు విస్తరణలో పగిలిపోయిన తాగునీటి పైప్‌లైన్‌కు పంచాయతీ సిబ్బంది బుధవారం మరమ్మతు పనులు చేపట్టారు. వారం రోజుల క్రితం రోడ్డు విస్తరణ కోసం నిర్మాణ పనులు చేపట్టడంతో పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో తాగునీటి సరఫరా లేక ఐదు రోజులుగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరమ్మతు పనులు పూర్తికావడంతో నీటిసరఫరా పునరుద్ధరించినట్లు కార్యదర్శి జయకర్ తెలిపారు.

న్యాయం చేయాలని వినతి

శంకర్‌పల్లి: వ్యవసాయం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 1967లో తమకిచ్చిన నాలుగు ఎకరాల భూమిని కొంతమంది కబ్జా చేస్తున్నారని మండలంలోని పొన్నగుట్టతండాకు చెందిన కిషన్, శంకర్, రాంసింగ్, ఆమ్రియాలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 1967లో ప్రభుత్వం తమ తండ్రి వాల్యాకి నాలుగు ఎకరాల భూమిని ఇచ్చింది. అప్పటి నుంచి దాన్ని ఏళ్లుగా సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. గత కొన్ని నెలల నుంచి మోకిల తండాకు చెందిన ఓ వ్యక్తి తమని భయభ్రాంతులకు గురిచేస్తూ, పొలం లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నాడు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ మంగళవారం పొలం వద్ద వారు పనులు చేస్తున్నారని సమాచారం అందింది. అక్కడికి మేము వెళ్లగా దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మోకిల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు ఇరువురు మాట్లాడుకోవాలని చెబుతున్నారే తప్పా.. కేసు నమోదు చేయడం లేదన్నారు.

విచారణ.. మమ!

- షోకాజ్‌తో షో చేసిన వ్యవసాయ అధికారులు
- 'అధిక ధరల' వ్యవహారం
- చివరికి మునిగింది రైతులే!



వ్యవసాయ అధికారులను నిలదీస్తున్న రైతులు

బషీరాబాద్: ప్రభుత్వ నిబంధనలను లెక్కచేయకుండా, అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తూ తమను మోసం చేస్తున్న వ్యాపారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రైతులు మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం బషీరాబాద్ రైతు వేదిక వద్దకు చేరుకుని వ్యవసాయ శాఖ అధికారులను నిలదీశారు. ఒక్క బస్తా యూరియా కోసం రోజుల తరబడి క్యూలైన్‌లో నిలబడ్డామని, ఇదే అదనుగా దుకాణం యజమానులు ఇష్టానుసారం ఎరువుల ధరలు పెంచి విక్రయించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయమై విచారణ చేపట్టిన అధికారులు చివరికి వ్యాపారులకే వంతపాడటంపై నిరసన తెలిపారు.

ఏం జరిగిందంటే..

బషీరాబాద్‌లోని ఓ ఫర్టిలైజర్ షాపులో యూరియా, డీఏపీ అధిక ధరలకు విక్రయిస్తున్నారని గత గురువారం పలువురు రైతులు వ్యవసాయ అధికారులకు మౌఖికంగా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన మండల వ్యవసాయ అధికారి సదరు షాపు షాపు యజమానికి శనివారం షోకాజ్ నోటీస్ ఇచ్చారు. ఐదు రోజుల్లో దీనిపై వివరణ ఇవ్వాలని రైతులు, మీడియా ముందు ఆదేశాలు జారీచేశారు. బుధవారం గడువు ముగియడంతో సదరు షాపు యజమాని వివరణ ఇచ్చుకున్నారు. యూరియా, డీఏపీ ధరలు తెలియక ఎక్కువ ధరకు విక్రయించామని, మరోసారి పొరపాటు కాకుండా చూస్తానని, బిల్లు బుక్కు కోసంఆర్డర్ ఇవ్వగా ప్రింటింగ్‌లో జాప్యం కావడంతో రశీదులు ఇవ్వలేకపోయామని దుకాణ యజమాని సంజాయిషీ ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు కర్షకులు రైతు వేదికకు చేరుకుని అధికారులను నిలదీశారు. ఎక్కువ ధరలకు అమ్మినట్లు దుకాణాదారులే ఒప్పుకొన్నారని చెబుతున్నా చర్యలు ఎందుకు తీసుకోలేదని ధ్వజమెత్తారు. ఇదిలా ఉండగా తాండూరు ఏడీఏ కూడా సదరు షాపు యజమానిని వెనకేసుకురావడంపై రైతులు అసహనం వ్యక్తంచేశారు. ఇదే విషయమై ఏడీఏను అడగగా తమపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని, మీడియాలో వచ్చిన కథనాలతో దుకాణ యజమానిపై చర్యలు తీసుకోలేమని చెప్పడం గమనార్హం. ఇదిలా ఉండగా పలువురు రైతులు మాట్లాడుతూ.. తమకు అండగా నిలవాల్సిన అధికారులు, నాయకులు వ్యాపారులకే మద్దతు పలకడం ఏమిటని వాపోయారు. గట్టిగా నిలదీద్దామంటే తమకు ఎరువులు కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతారని, అత్యవసరమైతే ఉద్దెర(క్రెడిట్) ఇవ్వరని పలువురు తెలిపారు. మరికొందరు మాత్రం అధిక ధరల విషయమై చర్యలు తీసుకోకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

రిటైర్డ్ డీఈ ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: మద్యం మత్తులో చెరువులో దూకి పంచాయతీరాజ్ రిటైర్డ్ డీఈ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నోయల్‌రాజ్ కథనం ప్రకారం.. సరూర్‌నగర్‌లో నివాసం ఉండే రమేశ్ డీఈగా పని చేసి రిటైరయ్యారు. కొంతకాలంగా మద్యానికి బానిసైన ఆయన అనారోగ్య సమస్యల బారినపడ్డారు. మన్నెగూడ ఆర్‌టీఓ కార్యాలయానికి వెళ్తున్నానంటూ గత మంగళవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. మన్నెగూడలోని సుచిరుచిలో మద్యం తాగి, తుర్కయంజాల్ మసాబ్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రమైనా భర్త ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య రోహిణి సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బుధవారం మసాబ్ చెరువులో తేలిన మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు రమేశ్‌గా గుర్తించారు. రోహిణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మాకేదీ.. 'ఇందిరమ్మ'?



వర్షానికి కురుస్తుండటంతో టార్పాలిన్ కప్పిన హన్మీబాయి ఇల్లు

- వాల్యానాయక్‌తండాకు ఒక్క ఇల్లు కూడా మంజూరు కాని వైనం
- ఆందోళన వ్యక్తంచేస్తున్న గిరిజనులు

దుద్యాల్: ఇందిరమ్మ మా ఊరికి ఇల్లేదమ్మా.. అంటూ మండల పరిధిలోని వాల్యానాయక్‌తండా గిరిజనులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దుద్యాల్ మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఈగ్రామానికి ఇందిరమ్మ పథకం మొదటి విడతలో ఒక్క ఇల్లు కూడా మాజూరు కాలేదు. తండాలో చాలా మంది అర్హులు ఉన్నా అధికారులు, పాలకులు తమపై దయ చూపలేదని వాపోతున్నారు. అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని, ఇందుకోసం పక్కాగా వివరాలు సేకరిస్తున్నామని చెప్పిన అధికారుల మాటలన్నీ అబద్ధాలేనని పేర్కొంటున్నారు. అధికారులు చేసిన సర్వేలో తమ గ్రామంలోని ఒక్కరికైనా ఇందిరమ్మల ఇంటికి అర్హత లేదా అని ప్రశ్నిస్తున్నారు. వాల్యానాయక్‌తండాలో 600 జనాభా నివసిస్తున్నారు. సుమారు 80 వరకు ఇళ్లు ఉన్నాయి. వీరిలో చాలా మంది పక్కా ఇల్లు లేవు. శిథిలావస్థకు చేరిన ఇళ్ల పైకప్పులపై టార్పాలిన్ కవర్లు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఒక్కసారి తమ తండాను, నివాసాలను పరిశీలించాలని స్థానికులు హన్మిబాయి, రాములు నాయక్, శివనాయక్, రవినాయక్, గోప్యానాయక్ తదితరులు కోరారు.

> **న్యాయం చేయాలి**
>
> 
>
> నాకు ఉండేందుకు గూడు లేదు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని పలుమార్లు అధికారులు, నాయకులకు విన్నవించా. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మాతండాకు ఇళ్లు ఇస్తారని ఆశపడ్డాం. కానీ ఒక్కరికి కూడా ఇల్లు రాకపోవడం బాధగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజనులకు న్యాయం చేయాలి.
>
> – మాణిక్యానాయక్, వాల్యానాయక్‌తండా

దాతల సహకారం మరువలేనిది



టై, బెల్టు, ఐడీ కార్డులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మండల విద్యాధికారి వెంకట్

దోమ: పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని మండల విద్యాధికారి వెంకట్ అన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని ఊటుపల్లి, కొండాయపల్లి గ్రామాల్లో గ్రామానికి చెందిన పట్లోళ్ల రాజేశ్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి అయా పాఠశాలలకు ఎల్‌ఈడీ టీవీ, విద్యార్థులకు టై, బెల్టు, ఐడీ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ..ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నప్పటికీ దాతలు కూడా సహకరిస్తే ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిష్టాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్, ప్రధానోపాధ్యాయులు పరిపూర్ణ, శివప్రసాద్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

17మంది టీచర్ల సర్దుబాటు



అంతారంతండాలో ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటయ్య

తాండూరు రూరల్: తాండూరు పట్టణం, మండలంలోని ఆయా పాఠశాలలకు 17 మంది టీచర్లను సర్దుబాటు చేసినట్లు ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. అంతారంతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు 14 మంది ఎస్జీటీలు, ముగ్గురు స్కూల్ అసిస్టెంటలను వివిధ స్కూళ్లలో సర్దుబాటు చేశామని స్పష్టంచేశారు. మైసమ్మతండా, జినుగుర్తితండా, గుండ్లమడుగుతండాలో ఒక్కో ఉపాధ్యాయుడే ఉన్నాడన్నారు. ప్రతీ పాఠశాలలోనూ విద్యార్థులకు మెరుగైన బోధన, నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఎంఈఓ వెంట అంతారంతండా హెచ్‌ఎం రమేశ్, సీఆర్‌పీ సుభాష్ తదితరులు ఉన్నారు.

డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలి

ఎస్‌ఐ వసంత్ జాదవ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వసంత్‌జాదవ్, షీ టీం ఇంచార్జి నర్సింహులు

దోమ: విద్యార్థులు, యువత డ్రగ్స్, గంజాయితో పాటు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ వసంత్‌జాదవ్ తెలిపారు. బుధవారం దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో షీటీం ఇంచార్జి నర్సింహులుతో కలిసి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులగురించి, డ్రగ్స్ రహిత సమాజం దిశగా ముందుకు సాగాలన్నారు. మహిళలపై ఎలాంటి దాడులు జరిగిన 100, 181 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం చేరవేయ్యాలన్నారు. మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధాన్ని పూర్తి స్థాయిలో కట్టడి చేయాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరమన్నారు. సైబర్ నేరాలకు గురైన వారు 1930కి సమాచాం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులు బి.సావిత్రి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్‌పై గందరగోళం వద్దు

- రైతులను తప్పుదారి పట్టించొద్దు
- పాత అలైన్‌మెంట్ ఓ కన్సల్టెన్సీ ఊహాజనితం మాత్రమే
- భూ భారతితోనే భూములకు పూర్తి రక్షణ
- 'సాక్షి'తో కలెక్టర్ నారాయణరెడ్డి



సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'హైదరాబాద్ నగరం శరవేగంగా విస్తరిస్తోంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కొత్త నగరాలు, రహదారులు, మౌలిక సదుపాయాలకు రూపకల్పన జరుగుతుంది. అందులో రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) కూడా ఒకటి. ప్రభుత్వం తమ ప్రతిపాదనను కేంద్రం ముందు పెట్టింది. ఇంకా ఫైనల్ కాలేదు. ఇప్పటికీ చర్చల దశలోనే ఉన్న ఈ రోడ్డుపై కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారు. జిల్లా ప్రజలను, రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారు. ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీ విడుదల చేసిన అనధికారిక అలైన్‌మెంట్(పాత)ను మార్చి, కొత్త అలైన్‌మెంట్ రూపొందిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. నిజానికి పాత అలైన్‌మెంట్ అనేది ఒక ఊహాజనితం మాత్రమే. భూసేకరణ విషయంలో రైతులను తప్పు దోవ పట్టించొద్దు' అని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ‘సాక్షి’ ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను, వాటి పరిణామాలను ఆయన మాటల్లోనే...

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మాత్రమే ఫైనల్

రావిర్యాల ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు అటు నుంచి ఆమనగల్లు వరకు ప్రతిపాదించిన గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశాం. తొలి విడతలో రావిర్యాల ఎగ్జిట్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు ఉన్న 20 కిలోమీటర్ల రోడ్డుకు 449 ఎకరాలు, రెండో విడతలో మీర్‌ఖాన్‌పేట వరకు అటు నుంచి ఆమనగల్లు వరకు 21.5 కిలోమీటర్ల రోడ్డుకు 554.35 ఎకరాలు భూమి అవసరమైంది. ఆ మేరకు మొత్తం 4,725 మంది రైతుల నుంచి 1004.22 ఎకరాలు సమీకరించాం. భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి అవార్డును పాస్ చేశాం. భూములు ఇచ్చేందుకు నిరాకరించిన కొంత మంది రైతులకు సంబంధించిన మొత్తాన్ని అథారిటీలో జమ చేశాం. ఇక్కడ ప్రస్తుతం ఎలాంటి సమస్య లేదు. టెండర్లు కూడా ఖరారయ్యాయి.

ఓ కొలిక్కి వచ్చిన బీజాపూర్ రహదారి

బీజాపూర్ జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. దీంతో ప్రభుత్వం అప్పా టు మన్నెగూడ వరకు(46.405 కిలోమీటర్లు) రోడ్డును రెండు వైపులా 60 మీటర్ల వరకు విస్తరించాలని నిర్ణయించింది. ఆ మేరకు రూ.928.41 కోట్లు ఖర్చు సహా 266.55 హెక్టార్ల భూమి అవసరం ఉన్నట్లు గుర్తించింది. ఇప్పటికే భూసేకరణ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. అయితే రోడ్డుకు ఇరు వైపులా ఉన్న 60 నుంచి 80 ఏళ్ల వయసున్న 915 మర్రి వృక్షాలను తొలగించాల్సి రావడంపై కొంత మంది పర్యావరణ వేత్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. పురాతన మర్రి చెట్ల ఉనికి దెబ్బతినకుండా మధ్యేమార్గంగా ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంది. ఇప్పటికే రెడ్ మార్క్ వేసిన 150 వృక్షాలు మినహా మిగిలిన వాటిని సర్వీసు రోడ్డుకు, ప్రధాన క్యారేజ్‌వేకు మధ్యలో ఉండేలా స్వల్ప మార్పులు చేపట్టారు. ఇప్పటికే మొయినాబాద్, చేవెళ్ల బైపాస్‌రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి.

నాలుగు వేల అర్జీలు క్లియర్ చేశాం

రెవెన్యూ సదస్సుల్లో భాగంగా 21 వేలకుపైగా అర్జీలు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, బాధితులకు నోటిసులు జారీ చేశాం. క్షేత్రస్థాయి నుంచి రిపోర్టులు తెప్పించుకుని ఇప్పటికప్పుడు వాటిని క్లియర్ చేసేందుకు యత్నిస్తున్నాం. రోజుకు సగటున 50 నుంచి 60 దరఖాస్తులను పరిష్కరిస్తున్నాం. ఇప్పటి వరకు నాలుగు వేలకుపైగా దరఖాస్తులను క్లియర్ చేశాం. ధరణి పోర్టల్‌లో దొర్లిన తప్పిదాలకు ‘భూభారతి’లో అవకాశం ఇవ్వడం లేదు. భూ భారతి పోర్టల్‌తో అన్ని సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తుంది.

> **ఇంకా ప్రతిపాదనల దశలోనే**
>
> నగరంపై ఒత్తిడి తగ్గించేందుకు ఔటర్ మాదిరిగా మరో రింగు రోడ్డు అవసరం ఉందని ప్రజలతో పాటు ప్రభుత్వం భావిస్తోంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తైతే జిల్లా రూపు రేఖలే మారబోతున్నాయి. భూముల ధరలు పెరిగి, రియల్ ఎస్టేట్ మరింత ఊపందుకునే అవకాశం ఉంది. ఈ రోడ్డుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నిజానికి ఇది ప్రభుత్వ ప్రతిపాదన మాత్రమే. ఎక్కడ నివాసాలు ఉన్నాయి? ఎక్కడ చెరువు ఉంది? ఎక్కడ బఫర్ జోన్ ఉంది? ఎక్కడ విల్లాలు ఉన్నాయో? స్పష్టత రాలేదు. రోడ్లు భవనాల శాఖ తుది రిపోర్టు తర్వాతే రెవెన్యూశాఖ భూసేకరణ ప్రక్రియను చేపడుతుంది. అయితే ప్రభుత్వ ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణంలో కొంత మంది త్యాగం చేయక తప్పదు. రైతులు అనవసరంగా ఆందోళన చెందొద్దు.

సాయుధ పోరు వారసులు కమ్యూనిస్టులే



సెమినార్‌లో మాట్లాడుతున్న డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్ పేర్కొన్నారు. బుధవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఇబ్రహీంపట్నం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వాస్తవాలు–వక్రీకరణ అనే అంశంపై ఇబ్రహీంపట్నంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్, ఎస్ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజులు విచ్చేసి మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాయుధ పోరాటం సాగిందన్నారు. నిజాం అరాచకాలకు ఎదిరిస్తూ సామాన్యులు సాయుధులుగా మారారన్నారు. నిజాంను గద్దెదింపడం కోసం నాయకత్వం వహించింది కమ్యూనిస్టులేనన్నారు. సాయుధ పోరులో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ స్థానమెక్కడిదన్నారు. నిర్బంధాలు, త్యాగాలు చేసింది ఎందరో చెప్పగలరా అని ప్రశ్నించారు. వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటానికి ఏమాత్రం సంబంధం లేని పార్టీలు విమోచన, విలీనం, విద్రోహం అంటూ నేడు చరిత్రను వక్రభాష్యాలు చెబుతున్నారన్నారు. బీజేపీ అనేక ఏళ్ల నుంచి తెలంగాణలో మతపరమైన భావోద్వేగాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శంకర్, డీవైఎఫ్‌ఐ కార్యదర్శి జగన్, నాయకులు సామేలు, గణేష్, శ్రీకాంత్, వంశీ, తరంగ్, జంగయ్య, అజయ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి మూల్యం తప్పదు
- అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



ఆమనగల్లులో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

ఆమనగల్లు: ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని తెలిపారు. ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన ఆయన బుధవారం తొలిసారి అచ్చంపేటకు వెళ్తున్న క్రమంలో బీజేపీ ఆమనగల్లు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ.. అన్ని విషయాల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కల్వకుర్తిలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, బీజేపీ రాష్ట్ర నాయకులు కండె హరిప్రసాద్, రాంరెడ్డి, మండల అధ్యక్షుడు కేకేశ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి, బీజేపీ నాయకులు దుర్గయ్య, సుందూరు శేఖర్, లక్ష్మణ్, చెన్నకేశవులు, రవిరాథోడ్ పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

దోమ: దొంగ ఎన్కేపల్లి గ్రామంలో విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను బుధవారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని కాళికాదేవి మాతకు యజ్ఞం నిర్వహించి వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశ్వకర్మలు మాట్లాడుతూ..విశ్వకర్మలకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేశంచారి, నాగేంద్రచారి, కృష్ణస్వామిచారి, మనచారి, చంద్రశేఖర్‌చారి, బ్రహ్మంచారి, వీరన్నచారి, కరుణాకర్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్‌లో..



దోమ: ఎన్కేపల్లి గ్రామంలో యజ్ఞం నిర్వహిస్తున్న విశ్వకర్మలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని మహాదేవుని ఆలయ ఆవరణలో విశ్వకర్మ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో గణపతిపూజ, శ్రీకాళికాదేవి, విశ్వకర్మ చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సంఘం సభ్యులు ఒకరినొకరు సహాయ సహకారాలు అందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆర్ జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంతు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: పట్టణ కేంద్రంలో విరాట్ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ వేడుకలను నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ప్రత్యేక పూజలు చేశారు.



కొడంగల్ రూరల్: స్వామివారి పూజలో విశ్వకర్మ సంఘం సభ్యులు



ప్రత్యేక పూజలో పాల్గొన్న నాయకులు